క్లుప్తంగా

కొండలమ్మకు ఎమ్మెల్యే ఆషాఢం సారె సమర్పణ



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆషాఢం సారెను బుధవారం సమర్పించారు. అమ్మవారికి ఎమ్మెల్యే పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు, పెన్నేరు రమేష్, ఈడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరీదేవి ఉత్సవాలు



గుడివాడరూరల్: పట్టణంలోని పుల్లలపాడు వంతెన వద్ద ఉన్న శ్రీబాల గణపతిస్వామి దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అలంకరణలో దర్శనమిచ్చిన స్వామికి వేద పండితులు స్వర్ణ శివరామకృష్ణ పంచ హారతులిచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. వేడుకల్లో దేవస్థానం కమిటీ పెద్దలు పొన్నా నాగమల్లేశ్వరరావు, తిప్పా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పామర్రు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో పామర్రు నాలుగురోడ్ల కూడలి వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్న వారిని అదుపు చేసినట్లు పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పామర్రు కూడలి వద్ద ఉన్న గుడివాడరోడ్డు, విజయవాడ రోడ్డు, బందరు రోడ్డు, చల్లపల్లి రోడ్డులో రహదారిపై ఉన్న బుధవారం దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై వ్యాపారులు చేయటం మంచిది కాదన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులతో బహుళ ప్రయోజనాలు



మండవల్లి: కౌలు రైతు కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. కానుకొల్లు రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు కౌలు రైతు కార్డులు (సీసీఆర్‌సీ) పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకోవడం వల్ల కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి పంట రుణాలు తీసుకోవడంతోపాటు ధాన్యం విక్రయించవచ్చన్నారు. కౌలు రైతులు పంట నష్ట పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా మాట్లాడుతూ రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. వీఏఏ సంధ్య పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు



ముదినేపల్లి రూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని ఊటుకూరు, వణుదుర్రు, వాడవల్లిలో కౌలు రైతులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు. అర్హులైన కౌలు రైతులు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, స్థానిక వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రూపుకోల్పోయిన గుడివాడ చానల్

గుర్రపుడెక్క పెరిగి ముందుకు సాగని నీరు



నందివాడ మండలం పోలుకొండ వద్ద గుడివాడ చానల్లో మేట వేసిన గుర్రపుడెక్క

గుడివాడరూరల్: వేలాది ఎకరాలకు సాగు, గ్రామాలకు తాగునీరు అందించే గుడివాడ చానల్లో గుర్రపుడెక్క మేట వేసి రూపు కోల్పోయింది. చానల్‌కు నీరు వదిలినా గుర్రపుడెక్క వలన చానల్ నుంచి నీరు దిగువనకు ప్రవహించే పరిస్థితి లేదు. యుద్ధ ప్రాతిపదికన కాల్వలు, చానల్స్‌లో పూడిక తీత పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులు పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ చానల్ ద్వారా గుడివాడ, నందివాడ, మండవల్లి మండలాల్లో పదుల సంఖ్యలో గ్రామాలకు తాగునీరు, పంటపొలాలు, చేపల చెరువులకు సాగునీరు అందుతుంది. ఈ చానల్ ద్వారానే ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు సాగు చేసుకుంటారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది చానల్లో ఉన్న గుర్రపుడెక్క, తూడు, నాచు తొలగింపు పనులకు టెండర్ల ప్రక్రియ ద్వారా అధికారులు కాంట్రాక్టర్లను పిలిచారు. పూడిక తీత పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గుర్రపుడెక్క తొలగింపు పనులను ఇప్పటి వరకు చేపట్టలేదు. ఈ సమయంలోనే ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో చానల్లో పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టకపోవడంపై రైతులు అసంతృప్తితో ఉన్నారు. నీరు దిగువకు సక్రమంగా ప్రవహించకపోవడంతో నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలోనే నీరు అవసరమని పూడిక తీత పనులు చేపట్టకపోతే ప్రయోజనం ఏమి ఉంటుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు కోసం ఇక్కట్లు

గుడివాడ చానల్ ద్వారా నందివాడ, మండవల్లి మండలాల్లోని పదుల సంఖ్యలోని గ్రామాల్లోని ప్రజలు తాగునీరు కోసం ఆధారపడతారు. వేసవి ముగిసిన తర్వాత పట్టిసీమ నుంచి నీటిని విడుదల చేసినా ఇప్పటి వరకు గుడివాడ చానల్ ద్వారా దిగువ గ్రామాలకు నీరు వచ్చిన దాఖలాలు లేవు. తమిరిశ నుంచి పోలుకొండ వరకు చానల్లో గుర్రపుడెక్క, తూడు భారీగా మేట వేసుకుపోయింది. పై నుంచి కాల్వలకు నీరు వదిలినా గుర్రపుడెక్క, తూడు వలన దిగువనకు నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో దిగువ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేపల చెరువులకు నీరు మాట దేవుడెరుగు, కనీసం తాగునీటి చెరువులకు నీరు వచ్చేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పూడిక తీతపై దృష్టిపెట్టలేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చానల్లో పూడిక తీయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

> **రెండు రోజుల్లో తొలగిస్తాం**
>
> వర్షాలు కురుస్తుండడంతో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనుల ప్రక్రియ సాధ్యం కాలేదు. రానున్న రెండురోజుల్లో తొలగింపు పనులు చేపడతాం.
>
> – బేగ్, ఇరిగేషన్ ఏఈ

కచ్చితమైన కొలతలు, తూనికలు నిర్వహించాలి



స్మార్టు పాయింట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న అధికారి రాజేంద్రప్రసాద్

పామర్రు: కచ్చితమైన కొలతలు, తూనికలను నిర్వహిస్తూ వ్యాపారాలను నిర్వహించాలని తూనికలు కొలతల శాఖ గుడివాడ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఉషోదయ, స్మార్టు పాయింట్‌లో బుధవారం ఆయన తూనికలు కొలతల గురించి పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న అన్ని వస్తువులు, వాటి ధరలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కాటాలకు సిఖలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. తమ కాటాలను అధికారుల వద్ద తీసుకొచ్చి వాటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించుకోవాలన్నారు. నాణ్యమైన వస్తువులను వినియోగాదారులకు అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. వస్తువుల ధరలను నిర్ణయించిన ధర కంటే ఎక్కువ అమ్మకాలు జరిపితే వారిపై తగువిధమైన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు మన్నికైన వస్తువులను కచ్చితమైన తూకాలతో అమ్మకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



గణపతి హోమపూజలు చేస్తున్న భక్తులు

గుడివాడరూరల్: పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న విఘ్నేశ్వరస్వామి దేవస్థాన మండపంలో సంకటహర చతుర్థి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీ గణపతి హోమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు కపిలవాయి అశోక్‌శాస్త్రి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. లోక కల్యాణార్థమే దేవస్థానంలో సంకటహర చవితి రోజున శ్రీలక్ష్మి గణపతి హోమ పూజలు నిర్వహించినట్లు దేవస్థానం ఈఓ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

మేడూరులో పొలంబడి కార్యక్రమం



కృష్ణాపురంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

పమిడిముక్కల: మండలంలోని మేడూరు, కృష్ణాపురం గ్రామాల్లో కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో వరిపంటపై బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సస్యరక్షణ కేంద్రం అధికారులు ప్రేమరంజిత, సురేష్, వీరబాబులు సాగు ఖర్చులు ఎలా తగ్గించుకోవాలి, భూసారాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, మండల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి, మండల హార్టికల్చర్ అధికారి నాగదేవిశ్రీ పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు



ఆటపాక నుంచి వరహాపట్నం రహదారిలో దెబ్బతిన్న రోడ్డు

కైకలూరు: ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు రహదారులు గుంతలమయంగా మారాయి. ప్రయాణికులు, వాహనదారులు రోడ్లపై నరకం చూస్తున్నారు. అడుగుకో గుంత మాదిరిగా కైకలూరు నియోజకవర్గంలో అనేక గ్రామీణ రహదారులు మారాయి. ప్రధానంగా పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో ముదినేపల్లి నుంచి ఆలపాడు వరకు అనేక ప్రాంతాల్లో గుంతలమయంగా మారింది. వర్షం కురిసినప్పుడు గుంతలు నీటితో నిండి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటపాక నుంచి వరహాపట్నం వెళ్లే రహదారిలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో అనేక గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆక్వా చెరువులతో రహదారులు ధ్వంసం

కైకలూరు నియోజకవర్గం ఆక్వా రంగానికి పెట్టింది పేరు. సింహభాగం ఆక్వా ఉత్పత్తులు ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతున్నాయి. రాష్ట్ర తలసరి ఆదాయంలో మొత్తం 679 మండలాల్లో కైకలూరు నియోజకవర్గంలో కలిదిండి, కైకలూరు మండలాలు మొదటి, ద్వితీయ స్థానాలను ఆక్రమించాయి. ఇందుకు కారణం ఆక్వా రంగమే. ఇదిలా ఉంటే ఆక్వారంగంతో లాభాలతో పాటు నష్టాలు జరుగుతున్నాయి. నిత్యం అధిక చేపల లోడుతో లారీలు తిరగడం వల్ల ఈ ప్రాంతంలో రహదారులు దెబ్బతింటున్నాయి. చేపల చెరువుల సమీపంలో రహదారులు చెరువు నుంచి వచ్చే నీటి ఊట కారణంగా త్వరగా పాడవుతున్నాయి. కొందరు ఆక్వా రైతులు రహదారులపైనే లోడింగ్ చేయడం వల్ల ఆ ప్రాంతంలో రోడ్డు దెబ్బతింటోంది. కొందరు రైతులు ముందుకొచ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు.

బురదమయంగా కొల్లేరు రోడ్లు

కొల్లేరు పరివాహక ప్రాంతాల్లోని రహదారులు నరక ప్రాయంగా మారాయి. కొల్లేరు ప్రాంతం చిత్తడి నేలలను కలిగి ఉంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. కైకలూరు, మండవల్లి మండలాల కొల్లేరు గ్రామాల్లో రహదారులపై అనేక చోట్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు తక్షణం అత్యవసర ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని కొల్లేరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు హైస్కూల్ సమీపంలో గుంతలమయంగా రహదారి

సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గుడివాడ మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి తెలియపర్చాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ 87126 24774కు తెలియజేయాలని పేర్కొన్నారు.

ల్యాండ్ టైటలింగ్ చట్టం కోసం బీజేపీ దురాలోచన

గుడివాడరూరల్: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డాది రాజేష్ ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టును ముందుగా తీసుకొచ్చింది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇదే చట్టాన్ని మసి పూసి మారేడుకాయ చేసి భూ ఆధార్ పేరుతో మళ్లీ భూములను సర్వే చేయడానికి కంకణం కట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం రద్దు చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను వేరే రూపంలో కేంద్ర ప్రభుత్వం అమలుపర్చడం దారుణమని పేర్కొన్నారు.

కాపు సంక్షేమ అధ్యక్షుడిగా వర్రే



ముదినేపల్లి రూరల్: కాపు సంక్షేమ సేవా సంఘం కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని చిగురుకోటకు చెందిన వర్రే హనుమాన్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీరాములు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడలపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాకుళం(ఘంటసాల): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎంఈఓ–2 మోమిన్ అన్నారు. మండల పరిధిలోని శ్రీకాకుళం జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ 2 ని ఎంఈఓ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలు కావడం వల్ల ఎన్నో నష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొంటారని, అదే క్రీడల్లో పాల్గొనడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వీర కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బడే వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు..!

పామర్రు: పంచాయతీ పరిధిలో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. స్థానిక అంకమ్మతల్లి గుడి వద్ద, విజయవాడరోడ్డు కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్, అదే రోడ్డులోని పలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులను కుక్కలు వెంబడిస్తూ, వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు, పాదచారుల వెంట పరిగెడుతూ వారిని కరుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కుక్కల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలు హక్కులను తెలుసుకోవాలి



వెలంపేట పాఠశాల్లో మిషన్ శక్తి పథకాన్ని వివరిస్తున్న సూపర్‌వైజర్ లావణ్య

కైకలూరు: రాజ్యాంగబద్ధంగా మహిళలు, బాలికలకు అందించే హక్కులను ముందుగా వారు తెలుసుకోవాలని గ్రేడ్–1 అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లావణ్య పేర్కొన్నారు. కైకలూరులో వెలంపేట ఎంపీయూపీ స్కూల్ వద్ద కేంద్ర ప్రభుత్వ మిషన్‌శక్తి కార్యక్రమంపై బాలికలు, మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ ప్రాజెక్టు లెవెల్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం జూన్ 21 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలోనూ 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్‌ఎం దానం ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు మీనాకుమారి, సుగుణ, కవిత, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్



కాటన్ విగ్రహానికి నివాళులర్పించిన పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు

గుడివాడరూరల్: సముద్రం పాలైపోతున్న గోదావరీ జలాలను లక్షలాది ఎకరాలకు మళ్లించిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని ఏఎన్‌ఆర్ కళాశాల పాలకవర్గ సెక్రటరీ, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాల్లో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి టెక్నాలజీ లేని బ్రిటిష్ కాలంలో రైతులు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన సర్ ఆర్థర్ కాటన్ ఒక గుర్రంపై అటవీ ప్రాంతంలో పర్యటించి ఒక బ్రిడ్జి నిర్మించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్రిడ్జి ఈ రోజు వేలాది ఎకరాల రైతులకు సాగునీరు అందుతుందంటే ఈ దొర పుణ్యమేనన్నారు. అతివృష్టి, అనావృష్టితో అతలాకుతలమవుతున్న గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మలచి వందలాది గ్రామాలకు తాగునీరు అందించి గోదావరి వాసుల మదిలో అజరామరంగా కాటన్ నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజా, పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దేవానందరావు

పామర్రు: మహాకవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక శివరామ కాంప్లెక్సులో బుధవారం నిర్వహించారు. బాబూ జగ్జీవన్‌రామ్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చిగళ్ల దేవానందరావు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక నవయుగ చక్రవర్తి జాషువా అని కొనియాడారు. దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు రాయవరపు వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ కోటేశ్వరరావు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

కుల వివక్షపై పోరాడిన మహనీయుడు

మండవల్లి: కుల వివక్షపై పోరాడి, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన మహనీయుడు జాషువా కీర్తి చిరస్థాయిగా నిలుస్తుందని అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, ఉపాధ్యక్షుడు పి.అభిష, సామాజిక కార్యకర్త ఎల్ ఎస్.భాస్కరరావు అన్నారు. బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జాషువా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కె.రవిప్రసాద్, విజయ్, గాంధీ, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన, ఎస్ వెంకటేశ్వరరావు, శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, యూనిఫాం పంపిణీ



కలిదిండి కార్యాలయం నుంచి యూనిఫాం, బూట్లు పంపిణీని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకరరావు

కైకలూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్లు, యూనిఫాం పంపిణీ చేస్తున్నట్టు కలిదిండి ఎంఈఓ పి.ప్రభాకరరావు పేర్కొన్నారు. కలిదిండి ఎంఈఓ కార్యాలయం నుంచి ఆరుతెగళపాడు, తాడినాడ పాఠశాలలకు వాహనాల ద్వారా బుధవారం వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో హైస్కూళ్లు, యూపీ, ప్రైమరీ మొత్తం కలిపి 66 పాఠశాలలు ఉన్నాయన్నారు. ఎంఈఓ కార్యాలయం నుంచి వాహనాల ద్వారా ఆయా పాఠశాలలకు యూనిఫాం, బూట్లు సరఫరా చేస్తున్నామన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు వీటి పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

యూనిఫాం పంపిణీకి ఏర్పాట్లు

ముదినేపల్లి రూరల్: పాఠశాలల్లోని విద్యార్థులకు ఏటా ప్రభుత్వం అందించే విద్యా సామగ్రి సిద్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే బ్యాగులు, బూట్లతో పాటు యూనిఫాం మండలానికి చేరుకున్నాయి. వీటిని ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో భద్రపరిచారు. పాఠశాలల వారీగా వీటిని ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేస్తామని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ తెలిపారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి



కలిదిండి గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు



ముదినేపల్లిలో అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కైకలూరు: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని కలిదిండి గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు మాట్లాడుతూ వెంకటరమణయ్య గ్రంథాలయోద్యమాన్ని నిర్వహించడమే కాకుండా ఆయుర్వేదం, ప్రకృతివైద్యం, పత్రికా సంపాదకుడిగా రాణించారన్నారు. కార్యక్రమంలో సాహితీ మిత్రులు చక్కా జగన్, పాఠకులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : గ్రంథాలయాల పితామహుడు అయ్యంకి వెంకటరమణ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో అయ్యంకి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులతో పూలలు వేయించి నివాళులర్పించారు.

సీతమ్మకు ఆషాఢ సారె

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతమ్మ తల్లికి భక్తులు బుధవారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. పూలు, పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, నూతన వస్త్రాలను మహిళలు పుర వీధుల గుండా ఊరేగిస్తూ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సారెను అమ్మవారికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



సీతమ్మ తల్లికి సమర్పించిన సారె

ప్రకటన